# గానమాధురి

సరోజిని రెండు అరచేతుల్లోను చెక్కిళ్లు పెట్టుకుని, కుర్చీలో కూచుని ఆలోచిస్తున్నది. కిటికీలోనుంచి సాయంత్రపు ఎండ ఆమె ముఖంమీద పడుతున్నది.

సరోజిని చక్కనిది. ఆమె పెద్ద కళ్లు, వంకరలు తిరిగిన పెదవులు, ఎల్లప్పుడూ నవ్వుతూనే వుంటవి. ఇప్పుడు కూడా, ఆమె మోము అట్లానే వుంది. కాని, ఆమె కళ్ళల్లో విచారం స్పష్టంగా కనిపిస్తున్నది.

కొంతకాలంనుంచీ సరోజినికి ప్రతి రోజూ యిట్లా వంటరిగా కూచుని, ఏదో విచారంతో బాధపడటం అత్యావసరంగా కనిపిస్తున్నది. ఆమె రోజూ ఇట్లానే విచారిస్తున్నది కూడా.

*     *     *

హిందూ గృహిణికి విచారం కాని, సంతోషం కాని, కలగడం సాధారణంగా తన భర్త వల్లనే. భర్త రూపవంతుడు, ఆరోగ్యమైనవాడు, ధనవంతుడు, మంచివాడు అయితే, హిందూ స్త్రీకి మరేమీ అవసరం లేదు. ఆమె జీవితమల్లా ఒక పండుగే.

సరోజిని భర్త మూర్తికి ఈ సుగుణాలన్నీ వున్నవి. అతడు చాలా మంచివాడు. అమాయకుడు, శాంతిమూర్తి. ఇంతకంటె ఏ గృహిణీ ఎక్కువ వాంఛించదు. కాని, సరోజిని మనస్సులో ఏమాత్రమూ సంతోషం లేదు. దీనికంతకూ కారణం, మూర్తిని ఇంతవరకూ తను అర్థం చేసుకోకపోవడమే. అతడు ఎంత మంచివాడో, అంత వింత వ్యక్తి. తన బాగోగులను ఒకరు చూడవలసిందే కాని, తను ఎరుగడు. తన భోజనం, దుస్తుల విషయమైకూడా ఒకరు చెప్పవలసిందే! అయితే, ఇదేమీ అంత విచారించవలసిన విషయం కాదు. అన్నిటికన్న ముఖ్యమైనది: మూర్తి, పాటలన్నా సంగీతమన్నా, తనువు మరిచిపోతాడు. ఇంట్లో ఒక చిన్న రేడియో సెట్టు, కొన్ని వందల రికార్డులతో సహా ఒక గ్రామఫోను వున్నవి. ఇంట్లో ఎప్పుడూ పాటలమయం. భోజన సమయంలో కూడా పాట వింటేనే కాని, మూర్తికి భోజనం సహించదు! ఒకొక్కమారు, చక్కని పాట వింటూ, తను చేయవలసిన పనులను కూడా మరిచిపోతాడు. ఆ సమయంలో, ఈ యిల్లూ, భార్య, ప్రపంచం, సంసారం ఏవీ అతనికి జ్ఞాపకం వుండవు. రోజూ రాత్రి, 10 గంటలవరకూ పాటలు వింటూ కూచుంటాడు. సరోజిని 9 గంటలకే నిద్రపోతుంది. ఆమె ఎప్పుడైనా, "అర్ధరాత్రివరకు మేలుకోవడం మంచిది కాదు. పేగిరం పడుకోండి" అంటే, మూర్తి తల ఎత్తి ఆమె అప్పుడే ఎక్కడినించో వచ్చినట్లుగా వింతగా చూస్తూ "ఊఁ? మంచిది కాదంటావా? అయితే సరే" అని అప్పుడు పడుకొంటాడు.

భర్త తన మాట నెప్పుడూ కాదనడని సరోజినికి తెలుసు. ఆమెమీద మూర్తికి అమితమైన ప్రేమ వున్నదని కూడా ఆమె గ్రహించింది. ఆమె కాపరానికి వచ్చిన ఏడాదినుంచి, మూర్తి ముఖంలో ఏనాడూ కోపాన్ని చూడ

వజ్ఝల రామనరసింహం

లేదు. అసలు కోపమంటే ఏమిటో అతనికి తెలిసినట్లు లేదు. ఓ రోజున ఆమె నవ్వుతూ, భర్తతో "మీకుకోపం ఎప్పుడైనా వచ్చిందా?" అని అడిగింది. అతడు వింతగా చూసి, ఓ గంటసేపు ఆలోచించి, "ఏమిటన్నావూ? నాకు కోపం వచ్చిందా అనా?" అని, తిరిగి ఆమెను ప్రశ్నవేశాడు. ఆమె పకపకా నవ్వింది.

ఒకొక్కనాడు సాయంత్రం పార్కుకి వెళ్ళి,పాటలు వింటూ కూచుని, రాత్రి ఏ పది గంటలకో యిల్లు చేరుకుంటాడు. సరోజిని ఖిన్నురాలయి, అతడు వచ్చిన వెంటనే, "చూడండి! ఎంత ఆలస్యంగా వచ్చారో. ఇంట్లో నేను వున్న సంగతే మరిచి పోయారు" అని అంటే, అతడు నిజంగా విచారంతో, "సరోజినీ! పాటలు వింటూ వుండిపోయాను. పాపం! నువ్వు ఆకలితో వున్న సంగతే మరిచాను" అంటాడు.

"నా కంటే, పాటలు మీకు ముఖ్యం అన్న మాట..." అని సరోజిని ఓ నాడు అడిగింది. మూర్తి తృళ్ళిపడినట్లయి, ఆమె వేపు చూస్తూ "లేదు సరూ, లేదు. నీకంటె నాకు ఏదీ ముఖ్యం కాదు. అన్నాడు. ఆనాడు భోజనం అయాక, మూర్తి గది అంతటా పచార్లు చేస్తున్నాడు. రేడియో వేసుకుంటే సరోజినికి కష్టం కలుగుతుందేమో అని ఆలోచిస్తున్నాడు. అరగంట తర్వాత, పక్కగదిలోంచి గ్రామఫోను పాట వినవచ్చింది. మూర్తి గబగబా పక్కగదిలోకి వెళ్ళి, గ్రామఫోను వేస్తున్న సరోజినితో, "రోజా! సరిగ్గా నాకు యిష్టమైన పాటే వేశావు! ఎంతబాగుంది!" అని పక్కని కూచున్నాడు. "ఏడాదయి కాపురం చేస్తున్నాను; మీకు ఏపాట యిష్టమో తెలుసుకోకపోతే నేనెందుకు పనికి వస్తాను" అంది సరోజ. కాని, మూర్తికి యిదేమీ వినపడలేదు. అతడప్పుడే పాటలో మునిగిపోయి ఉన్నాడు. సరోజిని వెళ్ళి పడుకుంది.

మూర్తి "కాదు" అన్నాడు కాని, నిజానికి అతనికి భార్య కంటె పాటలే ఎక్కువ ముఖ్యం అనిపిస్తుంది. ఎప్పుడూ పాటల గురించే మాట్లాడతాడు. తనతో, మరేదైనా విషయంగురించి చక్కగా వెన్నెట్లో కూచుని, ఆ విధంగా కబుర్లు చెప్పితే ఎంతబావుణ్ణు! అనుకుంది సరోజిని. తనతోనూ అనురాగంతోనే మాట్లాడతాడు... కాని... కాని ... అంతకంటె ఎక్కువవేదో తను వాంఛిస్తున్నది ... తన జీవితంలో ఏదో లోటు వున్నట్లుగా కనిపిస్తున్నది. ఈ పాటలమీద, సంగీతంమీద, తనకి అసూయ కలుగుతున్నది... ఐతే, భర్త తనతో అనురాగ పూర్వకంగా మాట్లాడిన సమయాలు లేకపోలేదు. కాని, అతడు సంగీత కళని, పాటలు పాడేవారిని వారి కంఠ స్వరాలను ఎంత పొగుడుతాడు! ఓనాడు తనతో, "సరూ, మొన్న మన ఇంటికివచ్చిన అమ్మాయి ఎంచక్కగా పాడింది!" అంటాడు. మరునాడు "కోకిల స్వరంతోపాడిన ఆవిడ ఎవరు? ఎంత అద్భుతమైన పాట..." అని అంటాడు. ఈ మాటల్లో కేవలం పాటని ప్రశంసించడం తప్ప మరెటువంటి దురుద్దేశంలేదని ఆమెకు తెలుసు. మూర్తి అగ్గివంటి మనిషి, ఏకపత్నీ వ్రతుడు. అతనిలో ఎటువంటి అవినీతికరమైన ఆలోచనలు కాని అలవాట్లు కాని లేవు.

అయితే-తనమీద మూర్తి మరి కొంచెం ఎక్కువ శ్రద్ధ చూపుతే బావుండునని సరోజిని అనుకుంది. ఎంత కాల మిట్లా? తనకి జీవితంలో కావలసినవి అన్నీ వున్నవి. కాని ఏమీలేనట్లుగానే వుంది. ఈ రేడియోని, గ్రామఫోనుని చూస్తున్నప్పుడు తనకి అమితమైన దుఃఖం, కోపం, కల్గుతున్నవి. తన భర్తయొక్క అభిమానాన్ని ప్రేమను ఈ రెండు ప్రాణంలేని వస్తువులు తననుంచి అపహరించి వేస్తున్నవి.

* * *

ఈ ఆలోచనకి అంతులేదు. ఈ సమస్యలకు జవాబులేదు. ప్రతి సాయంత్రం యిలా ఆలోచించుకొంటూ మనస్సును పాడు చేసుకోవడం తనకొక నిత్యకృత్య మయిపోయింది.

ఒక నిముషంపాటు సరోజిని తన రెండు కళ్ళనూ అరచేతులతో మూసుకొని, ఒక నిట్టూర్పువిడిచి, చుట్టూ చూసింది. అంతా అంధకారం! ఎంత వేగిరం చీకటిపడింది. టైము చూస్తే ఏడుగంటలైంది. తననింకా ఆ ఆలోచనలే వెంటాడుతున్నవి. ఆమె అట్లానే లేచి వెళ్ళి లైట్లు వెలిగించింది.

ద్వారంవద్ద చప్పుడైంది.

మూర్తి అప్పుడేవచ్చి, జోళ్లు విప్పుకుంటున్నాడు. సరోజిని అతనివేపు తీక్షణంగా చూస్తూ మెల్లిగా అంది.

"ఎక్కడికి వెళ్ళేరు?"

"టవున్ హాలులో గానకచేరీ అయింది... చాలా బావుంది."

సరోజిని మరేమీ మాట్లాడలేదు. మెల్లిగా లోపలికి వెళ్ళిపోయింది.

రాత్రి భోజనాలయ్యాక మూర్తి గ్రామఫోను రికార్డులో మంచిపాట నొకటివేసి, పడక కుర్చీలో పడుక్కుని పాట నానందిస్తూ వున్నాడు. ఇల్లంతా సంగీతమయమైంది. ఏమిటి ఈ పాటల మహాత్మ్యం? అనుకుంటున్నాడు మూర్తి. దుఃఖంతోను కష్టాలతోను నిండివున్న ఈ ప్రపంచంలోని మానవులందరినీ జోకొట్టి ఆనందపరచగలకళ ఇది. సంగీతాన్ని వింటూన్నప్పుడు తను ఏదో మత్తులో, మైకంలో ఆవేశంలో లీనం అయిపోతాడు. ఎంత విన్నా తనకు విసుకు జనించదు. ఎంతవిన్నా తనకు తృప్తి అవదు. ఈపాట పాడుతున్న ఆమె యొక్క అమృతకంఠం తనను ఏదో మత్తులో ముంచివేస్తున్నది.

మూర్తి భుజంమీద మెత్తని చేయి పడింది. మూర్తి వెనుతిరిగి చూశాడు. సరోజిని అతని కళ్ళల్లోకి దీనంగా చూసి, "గ్రామఫోను ఆపివేయండి...ఒకమాట చెప్పాలి" అని, గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయి, మంచంమీద పడుక్కుంది. మూర్తి ఫోను ఆపి, గదిలోనికి వెళ్ళి, సరోజిని పక్కని మంచంమీద కూచున్నాడు. సరోజిని కళ్లు మూసుకునివుంది. మూర్తి, ఆమెవేపు ఓమారుచూసి, అట్లానే కూచుని, ఏదో ఆలోచనలో పడిపోయాడు. రెండుగంటలు గడిచాయి. మూర్తి యింకా అట్లానే కూచునివున్నాడు. సరోజిని టక్కున కళ్లుతెరిచి, అతని ముఖాన్ని రెండుచేతులతో తనవైపు లాక్కుని, అతని కళ్లల్లోకి తీక్ష్ణంగా చూసింది. అతని ముఖం అంతా ఆలోచనలమయం! కేవలం శాంతిమయం!

"ఏమిటి చేస్తున్నారు, యింత సేపూ?" అని ప్రేమపూర్వకంగా అడిగింది.

"ఏమీలేదు! నువ్వెందుకు పిలిచావా అని అనుకుంటున్నాను!"

"ఈ అర్ధరాత్రి వరకూ అనుకుంటూనే వున్నారా! వెర్రిమనుషులై పోతున్నారు రోజురోజుకీ. ఇంతవరకూ మేలుకొని వళ్లు పాడుచేసుకుంటారా? మీ క్షేమం నాకెంతో అవసరమని మీకు తెలీదా? సరే! యిక పడుకోండి."

మూర్తి పడుక్కుంటూ, "ఏమిటి, ఏదో మాట చెప్తానన్నావే?" అన్నాడు. సరోజిని మెల్లిగా నవ్వి, అతని ముఖాన్ని అనురాగంతో నిమురుతూ "ఇవాళ కాదు! మరో రోజుని చెప్తాలెండి" అంది.

వారం రోజులు గడిచాయి. ఓనాడు రాత్రి భోజనాలయ్యాక, మూర్తి సరోజిని గదిలోకి రెండు పడక కుర్చీలలోను కూచుని లోకం భోగట్టాలు మాట్లాడుకొంటున్నారు. పది గంటలు అయ్యేసరికి సరోజినికి నిద్రవచ్చి, అట్లానే కుర్చీలో పడుకుంది.

మూర్తి మేల్కొనేవున్నాడు. కిటికీలోంచి చల్లని గాలి వస్తున్నది. ప్రపంచం అంతా నిశ్శబ్దంగా వుంది. అయిదు నిముషాలు గడిచాయి. మూర్తి ఏదో హఠాత్తుగా జ్ఞప్తికి వచ్చినట్లుగా దిగ్గునలేచి, డాబామీదికి వెళ్ళేడు. ఆ చీకటి రాత్రిలో, తోటలోని పూల మొక్కలు మసక మసకగా కనిపిస్తున్నాయి. ఆకాశంమీద నక్షత్రాలు మెరుస్తున్నవి. ఆ అంధకారాన్ని చీల్చుకుంటూ, ఆ పూల మొక్కలమీదుగా, పొదలమీదుగా, ఎక్కడినుంచో పరవశత్వం పొందించే పాట మెల్లిగా వినవస్తున్నది. మూర్తి డాబామీద అట్లానే నించుండిపోయి, మంత్రముగ్ధుడివలె పాట వింటున్నాడు.

మూర్తి అటువంటి గొంతుని ఇంతవరకూ వినలేదు. పిల్లన గ్రోవిలోని మాధుర్యమూ, చంటిపిల్ల కంఠ స్వరంలోని లేతదనము. వీణా నినాదంలోని గంభీరత-ఇవన్నీ ఆమె కంఠంలో మిళితమై వున్నవి, ఎవరో దేవకన్యక భూలోకంలోకి వచ్చి పాడుతున్న పాటలా వుంది అది. ఎక్కడిదీ గానం? ఆకాశంమీది నక్షత్రాలే ఈ సంగీతాన్ని ఆలాపిస్తున్నవా? స్వర్గంలోంచి బిథోవిన్ పాడుతున్న పాటా యిది?

లేకపోతే, ఈ అమృత కంఠం కల యువతి ఎవరు? ఎక్కడనించి వచ్చింది? ఎక్కడ వున్నది?

అంతకంతకూ, పాట హెచ్చు స్థాయిలో, తొందరగా, ఆవేశంతో పాడుతున్నట్లుగా వినిపిస్తున్నది. "ఈమె ఎవరో, తన పాటతో, ఈ ప్రపంచమంతటినీ గొప్పమత్తులో ముంచి వేస్తున్నది" అనుకున్నాడు మూర్తి. తన దేహమంతా పులకరిస్తున్నది. తను మైకంలో మునిగిపోయి, పడిపోతున్నట్లుగా వుంది.

హటాత్తుగా పాట ఆగిపోయింది. మళ్ళీ ప్రపంచమంతా నిశ్శబ్దం!

మూర్తి భుజంమీద మెత్తని చేతులు పడ్డవి. మూర్తి ఉలికిపడి, సరోజినిని చూశాక, మళ్ళీ యీ బాహ్యప్రపంచంలోకి వచ్చాడు. సరోజిని మాట్లాడకుండా, అతనిని చెయ్యిపట్టుకొని, గదిలోకి తీసుకు వెళ్ళి, "ఇంక నిద్రపొండి" అన్నది. మూర్తి ఆమెవేపు శాంతంగా ఓమారు చూసి, దుప్పటి కప్పుకొని, మెల్లిగా కళ్ళు మూశాడు.

మర్నాడు ఉదయం మూర్తి కాఫీ తీసుకొంటూవుండగా, ఎదురింటివేపునుంచి, కిందటి రాత్రి పాట మళ్ళీ వినవచ్చింది. మూర్తి కిటికీ వద్దనే పడకకుర్చీ వేసుకుని రోజల్లా కూచున్నాడు. ఎవరో కాని, రోజల్లా విసుగు లేకుండా అట్లానే పాడుతూ వున్నారు. ఆ కంఠం కిందటి రాత్రి తను విన్న కంఠమే నని మూర్తి గ్రహించాడు.

సాయంకాలం మూర్తి సరోజినితో అన్నాడు: "ఎదురింట్లో ఆపాట ఎవరు పాడుతున్నారో తెలుసా?"

"తెలీదు. కాని, నిన్న సాయంత్రం ఎవరో ఒక ముసిలావిడ, ఒక అమ్మాయి ఎదురింటి మేడమీద అద్దెకి దిగేరుట."

అద్భుతమైన ఆ పాటనుబట్టి ఆమెయొక్క రూపురేఖలని మనసులో వూహించుకోడానికి మూర్తి ప్రయత్నిస్తున్నాడు. ఆ అమృత కంఠాన్ని బట్టి ఆమె ఒక దివ్యలావణ్యమూర్తి అయివుండాలి అని మూర్తి అనుకుంటున్నాడు. ఆమెపాటలోని గంభీరతవల్ల ఆమె ఒక గంభీరమైన సుందర విగ్రహం అయివుండాలి.

మరునాడుకూడా పాటలు రోజల్లా వినవస్తూనే వున్నవి. ఆమెకు ఎంత విసుగులేదో! ఆ పాటలని ఎంతసేపు విన్నాకూడా ఎవరికీ విసుగు జనించదు. మూర్తి కిటికీవద్ద కుర్చీలోనే కూచున్నాడు. ఆమెకు రోజూ పాటలు పాడడం, ఇతనికి వినడం తప్పితే మరేమీ పని వున్నట్లులేదు.

సాయంత్రం నాలుగు గంటలవుతూవుండగా, ఎదురింటి మేడమీద బట్టలు ఆరవేస్తూ, పదహారేళ్ళ అమ్మాయి ఒకర్తె కనిపించింది. బట్టలు ఆరవేస్తూ ఆమె పాడుకొంటున్నది. అదే పాట! అదే కంఠం! మూర్తి దిగ్గున లేచి నుంచుని, కిటికీలోంచి ఆమెవేపు పరిశీలనగా చూసి, ఆశ్చర్యపోయాడు. తను వూహించుకొన్న చిత్రానికీ, ఈ యువతికీ చాలా భేదంవున్నది.

ఈమె దివ్యసుందర విగ్రహంకాదు. గంభీరత అసలేలేదు. సామాన్యమైన రూపం తప్పితే మరేమీలేదు. కళాదృష్టితో చూస్తే ఈమె అంద విహీనురాలని అనిపిస్తుందికూడా... ఆమె నేత్రాలు మాత్రం చాలా బావున్నవి. మూర్తి ఓ నిముషం అట్లాచూసి, బట్టలు వేసుకుని పార్కుకి వెళ్ళిపోయాడు.

ఆనాడు రాత్రి భోజనం అయాక మూర్తి గదిలో కుర్చీలో మేనువాల్చాడు. మళ్ళీ ఆ పాటలు వినవస్తున్నవి. ఇప్పుడు ఆమె ఏదో సరికొత్తపాట ఒకటి పాడుతున్నది. డాబామీదికి వెళ్ళితే పాట మరీ బాగా వినవస్తుంది. కాని, మూర్తి మనస్సు వింతవింత ఆలోచనలతో నిండివున్నది. ఈ సమ్మోహనమైన పాటలని ఈమె పాడుతున్నదా? ఆమె రూపానికి, పాటకి ఎంత భేదం! అంత చక్కటి కంఠాన్ని యిచ్చిన దేవుడు, అటువంటి చక్కటి రూపం కూడా ఎందు కీయలేదు? మూర్తి అట్లానే కుర్చీలో తొమ్మిది గంటలు కొట్టేవరకు పడుకున్నాడు. అతని మనస్సులో, ఆమెరూపానికీ, ఆమెపాటకూ గొప్ప పోట్లాట జరుగుతున్నది. డాబామీదికి వెళ్ళకూడదని మూర్తి నిశ్చయం చేసుకొన్నాడు. కారణం అతనికి తెలియదు.

మరొక అరగంట గడిచింది. పాట ఇంకా వినిపిస్తూనే వున్నది. మూర్తి లేచి మెల్లగా పడక కుర్చీని ఎత్తి, డాబామీదికి వెళ్ళి, కుర్చీ

వేసికొని పడుకున్నాడు.

మూర్తి ఆకాశం వేపు చూస్తున్నాడు. లోకమంతటా నిశ్శబ్దంగావుంది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఆమె పాట వినవస్తున్నది!

"ఈ అంధ విహీనురాలైన బాలికయేనా నన్నిక్కడికి రప్పించింది" అనుకున్నాడు మూర్తి. ప్రస్తుతం తను, ఆ పాట, తప్పిస్తే ఈ జగత్తులో అంతా శూన్యంగా కనిపిస్తున్నది మూర్తికి. ఈ జగత్తంతా మిథ్య. ఈ విశ్వంలో తను, ఆ పాట మాత్రమే జీవించివున్నారు. ఈ మినుకు మినుకు మనే తారలు, ఈ ఆకాశం. తను, అందరూ ఈ పాటకోసమే, ఈ సంగీతం కోసమే. ఈ సంగీతంవల్లనే, జీవించివున్నారు. ఈ ప్రపంచంలోని కుళ్ళుకి, కక్షలకి, దౌర్జన్యాలకు, అతీతమై, అందరికీ శాంతి నిచ్చేది ఈ సంగీతమే, గానమే. ఏ శాంతి సంఘాలు, ఏ శాంతి సందేశాలు చేయలేని విచిత్రమైన పనులను ఈ గాన కళ చేయగలదు. ప్రపంచం ఏనాడైనా బాగుపడాలంటే, నిర్మలమైన గానమే ఆధారం!

మూర్తి ఆలోచనలతో పాటు సంగీతం కూడా మరీ త్వరగా, విచిత్రమైన ఆవేశంతో వినిపిస్తున్నది. ఈ అర్థరాత్రి నిశ్శబ్దతలో ఈ అద్భుత గానం ఎట్లా వినిపిస్తున్నది! మూర్తి శరీరమంతా ప్రతి నిముషమూ పులకరిస్తున్నది. చాలా సేపటికి పాట ఆగింది. తోటలో కీచురాళ్ళ ధ్వని మెల్లిగా వినిపిస్తున్నది. మూర్తి ఏవేవో ఆలోచనలతో నిద్రపోయాడు.

మరునాడు మధ్యాహ్నం మూర్తి బజారునించి వచ్చేసరికి, సరోజినితో ఎవరో పదహారేళ్ళ అమ్మాయి నవ్వుతూ మాట్లాడుతున్నది. మూర్తి ఆ అమ్మాయివైపు ఆశ్చర్యంతో చూశాడు. ఎందుకంటే, ఆమె మరెవరో కాదు. ఎదురింట్లో రోజల్లా పాటలుపాడే అమ్మాయి!

మూర్తి జోళ్లు విప్పుకుని, పడక కుర్చీలో కూచుంటూవుండగా, ఆ అమ్మాయి నవ్వుతూ సరోజినితో అంది: "అక్కయ్యగారూ! ఇంత ఎండవేళప్పుడు బావగారు ఎక్కడినించి వస్తున్నారండీ!" సరోజిని నవ్వుతూ "నాకు సంపెంగ పువ్వులు తేవడానికి వెళ్ళేరు" అంది.

ఆఅమ్మాయి మూర్తివేపు తిరిగి, "మాశారా బావగారూ! తన సంపెంగ పూలకోసం మా అక్కయ్య మిమ్మల్ని ఎండలో తిప్పడం ఏమైనా బాగుందా" అన్నది నవ్వుతూ.

మూర్తి చాలా సిగ్గుపడిపోయాడు. ఈ దేశంలో స్త్రీలు మగవారితో ఇంత చనువుగా, స్వేచ్ఛగా మాట్లాడం మూర్తి ఇంతవరకూ ఎరుగడు. అంచాత, ఈమె తనతో చాలా కాలంనుంచి ఎరిగున్న దానివలె మాట్లాడుతూ వుంటే, మూర్తికి ఆశ్చర్యమూ, సిగ్గు కలిగాయి. అతని సిగ్గు చూసి కాబోలు ఆమె మళ్ళీ అంది:

"నేనింత చనువుగా, సిగ్గులేకుండా మాట్లాడుతున్నానని మీకు చాలా ఆశ్చర్యంగా వుంది కాబోలు!...యిందులో సిగ్గుపడటానికి ఏముంది చెప్పండీ? నాలో పెద్ద సౌందర్యం ఏమీ లేదు. పురుషులు నన్ను మోహించివేస్తారా అని భయపడటానికి! అసలు, నేను స్త్రీననే విషయాన్నే అప్పుడప్పుడు మరిచిపోతూ వుంటాను. అంచాత, నేనందరితోను స్వేచ్ఛగా, చనువుగా మాట్లాడతాను."

మూర్తి మనస్సులో ఎందుకో చాలా నొచ్చుకున్నాడు. ఆమె మాటలు అతన్ని చాలా గాభరా పెట్టినవి. ఇంత సూటిగా, దాపరికం లేకుండా మాట్లాడే మనుషులు ఈ నాగరికపు రోజుల్లో చాలా అరుదు.

మూర్తి తడబడుతూ, మెల్లిగా అన్నాడు: "ఛా, ఛా. మీరు మీ రూపురేఖల్ని గురించి అట్లా అనుకోవడం ఏమీ సమంజసంగా లేదు. ఎందుకంటే, కేవలం రూపమే మానవుడి విలువలను నిర్ణయించదు కనుక."

"అంతే అంటారా?"

మూర్తి ఆమెవేపు చూస్తూ, ఏదో కొంతసేపు ఆలోచించి, మెల్లిగా అన్నాడు:

"రోజూ మీ యింటివైపునుంచి చక్కటి పాటలు వినపడుతున్నవి. మీరేనా పాడుతున్నారు?"

"ఔను, నేనే! ఏం, మీకు విసుగెత్తిస్తున్నవా?"

మూర్తి ఎందుకో తృళ్ళిపడ్డాడు. ఆతర్వాత అరచేతిలో నుదురు వుంచుకొని ఏదో దీర్ఘాలో

చనలో పడిపోయాడు. ఆ ఆలోచనలో ఆ అమ్మాయి వెళ్ళిపోయిన సంగతి కూడా అతను గమనించలేదు.

మర్నాడు సాయంత్రం కూడా ఆఅమ్మాయి వచ్చింది. మూర్తి ఆమెను చూసి, కూర్చోమని, "మీ పేరు అడగడం నిన్న మరిచాను" అన్నాడు.

ఆమె పకపకా నవ్వి, "ఇవాళ అడుగుతే నేను చెప్పననుకున్నారా!- నాపేరు రాధ" అంది.

ఆనాడు చీకటి పడుతూవుండగా వారు ముగ్గురూ సముద్రపుటొడ్డుకి షికారు వెళ్ళేరు. అందరికీ దూరంగా, ఓ చిన్న రాతి మీద ముగ్గురూ కూచున్నారు. నీటి తుంపరలతో గాలి వీస్తున్నది. మూర్తి రాధతో అన్నాడు:

"రాధా! శ్రమ అనుకోకుండా వుంటే, నిన్నొకపాట పాడమని కోరుతున్నాను."

"శ్రమ ఏమిటండీ బావగారూ! ఒకటి కాదు- రెండు పాటలు పాడుతాను వినండి!"

ఆమెపాడుతున్నది.మూర్తివిస్తుబోయి,మంత్ర ముగ్ధునివలె మత్తులో వున్నవానివలె అయిపోయాడు.సరోజినికూడానిశ్శబ్దఅయినది.ఎదురుగా సువిశాలమైనగంభీరమైనసముద్రములోనిఅలలు కూడ, పాటని విని ఆనందిస్తున్నట్లుగా మెల్లిగా లేచి పడుతూ పాటకి లయ వేస్తున్నవి.

అంత సమీపంలో మూర్తి రాధయొక్క పాటను వినడం యిదే మొదటిసారి. ఆమె కంఠస్వరంలో ఎదుటివారిని మంత్రింపచేసే శక్తి ఏదో వుందని మూర్తి అనుకుంటున్నాడు.

రాధ ఎంతసేపు పాడిందో ఎవరికీ తెలియదు. కాని, రాధ తన పాటలో లీనమైపోయింది. అందరినీ లీనం చేసినది. ఆమె గానము ఆపు చేసేసరికి, చుట్టూ గాడాంధకారం! బీచి ఒడ్డు అంతటా నిశ్శబ్దం కమ్ముకొనివుంది. సముద్రం మాత్రం హోరుమని శబ్దం చేస్తున్నది. ఆకాశం మీద నక్షత్రాలు మినుకుమినుకు మంటున్నవి. అందరూ, చాలా సేపటి వరకు, అట్లానే, మౌనంగా కూర్చున్నారు. ఆతర్వాత సరోజిని లేస్తూ "ఇంక యింటికిపోదాం రండి" అన్నది. రాధ కూడా లేచి నించున్నది. మూర్తి యింకా అట్లానే కూచున్నాడు.

రాధ అతని చెయ్యి పట్టుకొని లేవనెత్తి, "వేగిరం లేవండి! చాలా రాత్రి అయింది" అన్నది. మూర్తి లేచి, వారి వెనకాలే, ఎవరో నడిపించి తనను తీసుకువెళ్తున్నట్లుగా, వెళ్లేడు.

(వచ్చే సంచికతో ఆఖరు)




**నెలల పర్యంతమైన వ్యాధిగ్రస్థతను తప్పించండి**

క్రుంగదీయగల్గిన లివర్ వ్యాధి, పిల్లలలో కొద్దికొద్ది జబ్బుచిహ్నములతోనే ప్రారంభమవును. ఈ లక్షణములు విడువకుండా యున్నా, లేక తిరుగబెట్టుతున్నా, వాటి కారణములను వైద్యుని కనుగొననివ్వండి.

మలబద్ధకము లేక అతివిరేచనములు - వాంతులు - స్వల్ప జ్వరము - ఆహారమందయిష్టత - సోమరిగాయుండుట - చిరచిర లాడుట - కడుపు ఉబ్బరము లేక కాక - బరువు తగ్గిపోవుట.

**జమ్మివారి లివర్ క్యూర్**

లివర్, ప్లీహ వ్యాధుల నివారణకు విరోధనకుగూడా సహాయపడును అన్ని మందుల షాపుల్లో దొరకును.

గాంధీనగర్, విజయవాడ
రాజాబజార్ విజయనగరము.
ఇతరవైద్యశాలలు:- బొంబాయి నాగపూరు • లక్నో • కలకత్తా తిరుచిరాపల్లి • కుంభకోణము బెంగుళూరు.

**జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్సు.**
2, బ్రాడీస్ రోడ్, మైలాపూరు, మదరాసు.

SISTAS-J-159-Telugu